క్లుప్తంగా

మాజీ జెడ్పీటీసీ కుటుంబ సభ్యులకు పరామర్శ



శంకరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామంలో మాజీ జెడ్పీటీసీ కె.శంకరరావు ఇటీవల స్వర్గస్తులైనందున ఆయన కుటుంబసభ్యులు నిర్వహించిన పెదకర్మ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సోమవారం పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ పరామర్శలో సర్పంచ్, ఎంపీటీసీ, మండల వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి అప్పలనాయుడు, పోపురెడ్డి అప్పలనాయుడు, జక్కువ పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పారావు, బాయఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలతో ప్రభుత్వ సేవలు చేరువ



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: మండలంలోని రాజయ్యపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. సచివాలయ ఉద్యోగులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పార్టీ మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, ఎంఎంఎస్ అధ్యక్షులు సామంతుల అరుణకుమారి, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స పర్యటన

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కిలో దివంగత నేత అప్పికొండ శ్రీరాములునాయుడు పేరున నిర్మించిన కళ్యాణమండపాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులు మీదుగా మంగళవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చే వినతుల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అందుకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా..



మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

బాడంగి: మండలంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు సత్వరమే చెల్లించి వారిని ఆదుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఏడాది కాలంగా జీతాలు లేక కార్మికులు కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, ఎంపీపీ ప్రతినిధి మధు కార్మికులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. 22వ తేదీలోగా జీతాలు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తామని ఎప్పడంతో వారంతా ఆందోళన విరమించారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన అలజంగి గ్రామస్తులు
- 400 కుటుంబాలు పార్టీలో చేరిక
- కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే శంబంగి



పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని, సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న వెంటే తామంతా ఉంటామని అలజంగి గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామానికి చెందిన సుమారు 400 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో 12,13వ వార్డు మెంబర్లు యజ్జల అన్నపూర్ణ, యర్రారపు లక్ష్మి, సంకిలి లక్ష్మి, అలమండ అన్నమ్మ, సంకిలి మరియమ్మ, యజ్జల పైడితల్లి, చింతాడ ఉజ్వల్, యర్రారపు అప్పయ్య, యజ్జల సునీత, యజ్జల శిరీష, కోటిపల్లి ఇందిర, యజ్జల గైరమ్మ, గుజ్జల గంగమ్మ తదితరులు ఉన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పూడి చిన్న ఆధ్వర్యంలో సోమవారం వారంతా ర్యాలీగా బొబ్బిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు వారందరికీ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఓ సారి మంత్రిగా పనిచేసని రాజుల పేరు చెపితే గుర్తొచ్చే అభివృద్ధి పని నియోజకవర్గంలో ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేసి పార్టీలు మారి వారు లబ్ధిపొందారు తప్ప నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. మంత్రి పదవిలో ఉన్న రెండేళ్లలో వారి బినామీ ఆస్తులు రెగ్యులరైజ్ చేసుకున్నారని, అలాగే సుగర్ ఫ్యాక్టరీ పేరుతో రైతుల వద్ద టన్నుకు కొంత డబ్బులు వసూలు చేసి కళాశాల నిర్మించారని, మిగిలిన సొమ్మును మద్రాసులో దాచుకున్నారని ఆరోపించారు. రైతుల డబ్బుతో కట్టిన రాజా కళాశాలను బైలాలు కాల్చేసి వారు స్వంతం చేసుకున్నారన్నారు. ప్రజల గురించి ఆలోచించని, అభివృద్ధి చేయని వారికి ఓటు వేస్తే, ఆ ఓటు నిరుపయోగం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు రాజులకు బుద్ధి చెప్పకపోతే పేదవర్గాల బతుకులు బానిస బతుకులవుతాయన్నారు. రానున్న ఎన్నికలలో బొబ్బిలి రాజులు భవిష్యత్‌లో పోటీ చేయడానికి భయపడేలా తీర్పునివ్వాలని పిలుపునిచ్చారు. మనతో పాటు మన పిల్లల భవిష్యత్ కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ తూముల భాస్కరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ టి.దామోదరరావు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన అలజంగి గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



హెల్త్ వెల్‌నెస్ కేంద్రం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సోమవారం ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ పాలనను చేరువ చేశారన్నారు. హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు చేరువ చేశారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పథకాల మంజూరులో ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి మరోసారి ఓటు వేసి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణారావు, జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



రాజాం: హరికృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన పోతురాజు చిరంజీవినాయుడు, శ్రీనివాసరావు తల్లి పోతురాజు అన్నపూర్ణమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. అన్నపూర్ణమ్మ మృతికి గల కారణాలను ఆమె కుమారులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పోతురాజు హరికృష్ణను పరామర్శించారు. ఇటీవల అతని తండ్రి రమణ మృతి చెందడంతో ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్సీ వెంట పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, పాలవలస దవళేశ్వరరావు, ఎంపీటీసీ బౌరోతు కాంతారావు, పోతురాజు బ్రహ్మంనాయుడు, లెంక గణనాథ, కె.సూర్యారావు, బి.నర్సింహులు, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట గ్రామానికి చెందిన సర్పంచ్ కరణం శ్రీనివాసరావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. శ్రీనివాసరావు బావ నెలిరోతు సీతంనాయుడు పాముకాటుకు గురై మృతిచెందాడు. సీతంనాయుడు కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు కరణం గోవిందరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, గార రమణ, వావిలపల్లి శశిభూషణరావు తదితరులు ఉన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలి: వలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



సంతకవిటి: సేవారత్న పురస్కారానికి ఎంపికైన వలంటీర్లను సత్కరిస్తున్న తలే రాజేష్, జగన్మోహనరావు, తదితరులు

బొబ్బిలి: అత్యవసర సమయాల్లో మేమున్నామంటూ సేవలందించే వలంటీర్లకు ప్రభుత్వం సేవా పురస్కారాలు ఇవ్వడం శుభపరిణామమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక కళాభారతి వద్ద ఎంపీపీ శంబంగి వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో పాల్గొని అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించారు. మండలంలో 359 మంది వలంటీర్లకు సేవా మిత్ర, ఐదుగురికి సేవా రత్న, ఒకరికి సేవా వజ్ర అవార్డులు వరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందిస్తూ ఆయా కుటుంబాల్లో ఒకరిగా వలంటీర్లు మారిపోయారని అన్నారు. కోవిడ్ సమయంలో వారు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తరావల్లి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.అప్పలనాయుడు, ఎంపీడీఓ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటిలో..

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలో ఉత్తమ సేవలందించిన 347 మంది వలంటీర్లకు సేవా మిత్ర, ఐదుగురికి సేవా రత్న పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అవార్డులు అందుకున్న వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని, తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని అర్హులకు ప్రభుత్వ పథకాలు చేరవేస్తూ ప్రభుత్వంలో ఎంతో కీలకంగా మారారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 600 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతానికి పైగా అమలు చేసిందని అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంట్రేటి కేసరి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్యకర్త శ్రీదేవి, తదితరులు

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకను కార్యకర్త వై.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను, ఆయన సాధించిన విజయాలను ప్రీస్కూల్ పిల్లలకు వివరించారు. ఛత్రపతి శివాజీ జీవితాన్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు లక్ష్మి, హైస్కూల్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

కార్యదర్శుల హర్షం



ఎంపీడీఓకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు

తెర్లాం: గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీఓలుగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ బి.మధుసూదనరావును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీఓ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీవో 11 జారీ చేసిందని, ఇకమీదట కార్యదర్శులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ వారికి సూచించారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: నిరుద్యోగ యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీడెప్ డైరెక్ట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తిరుమలరావు అన్నారు. స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో సోమవారం వైకేపీ, సీడెప్ సంయుక్తంగా నియోజకవర్గ స్థాయిలో జాబ్ మేళా నిర్వహించారు. ఎంపికైన వారందరికీ మూడు నెలల పాటు స్కిల్ కాలేజీలలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సీడెప్ డైరెక్టర్ తెలిపారు. ఈ మేళాకు 66 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా వారిలో 36 మందిని వివిధ కోర్సులకు ఎంపికయ్యారని ఏపీ ఎ.చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఎస్.అరుణ, ఏపీఎంలు అప్పలనాయుడు, దదికుమార్, హేమలత, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల తొలగింపు అన్యాయం



మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న కార్మికులు

బాడంగి: మిమ్స్ ఉద్యోగుల తొలగింపు దుర్మార్గమని, విధుల నుంచి తొలగించిన ఉద్యోగులను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నేత సురేష్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల తొలగింపునకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డుపై సోమవారం రస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనాలు పెంచాలని కోరిన ఉద్యోగులపై మిమ్స్ యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం అన్యాయమన్నారు. క్రమశిక్షణ చర్యలు పేరుతో ఇద్దర్ని సస్పెండ్ చేసి తొలగించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యూటీ సమయంలో ఉద్యోగులను వేధించడం సరికాదన్నారు. రెండేళ్లు పూర్తిచేసుకున్న ఉద్యోగులను, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు. లేనిచో ఆందోళన ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు పలువురు కార్మికులు ఉన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి



తెర్లాం: తెర్లాంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం



బాడంగి: ముగడలో వీధి నాటిక ద్వారా ఎయిడ్స్‌పై అవగాహ కల్పిస్తున్న కళాకారులు

బాడంగి/తెర్లాం: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కళాజాతా బృందం సోమవారం వీధి నాటకం ప్రదర్శించారు. రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారుల ఆదేశాల మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఊరూరా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, వ్యాధి కలిగిన వ్యక్తులతో అసురక్షిత శృంగారంలో పాల్గొనడం ద్వారా వ్యాధి వ్యాపిస్తుందని, వ్యాధి వ్యాప్తి, లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో కలిసి మాట్లాడటం, భోజనం చేయడం, కలిసి తిరగడం వల్ల వ్యాధి రాదని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని అన్నారు. లైంగిక చర్యలో పాల్గొనేటప్పుడు తప్పనిసరిగా కండోమ్‌ను వినియోగించడం ద్వారా హెచ్ఐవీ వ్యాప్తికి అడ్డుకట్ట వేయొచ్చన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం అధ్యక్షురాలు జి.శోభారాణి, పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి, డీఆర్‌పీ ఎస్.అప్పలనాయుడు, సూపర్‌వైజర్ కె.రామకృష్ణ, లింక్ వర్కర్ జీవీ రమణమ్మ, ఆశావర్కర్ సరోజినమ్మ, ముగడ సర్పంచ్ చప్ప శివుడునాయుడు, వైద్యాధికారులు, చైతన్యభారతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎం.కాశీవిశ్వనాథం, బి.యశశ్విని, టి.దేవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రామాలయ ప్రతిష్ట



స్వామివారి ఆలయంలో ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్, తదితరులు

వంగర: మండలంలోని శ్రీహరిపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మూడు రోజులుగా నిర్వహించిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కరణం రాధమ్మ, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, సర్పంచ్ శనపతి సత్యారావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కళ్యాణం

వంగర: మండలంలోని కె.కొత్తవలసలో వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పనస రమణనాయుడు, కళావతి దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు భోగాపురపు కృష్ణశర్మ, వేమకోటి రమాకాంత్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాలతో కళ్యాణం జరిపించారు. వేంకటేశ్వరస్వామి, అలివేలి మంగ, పద్మావతి అమ్మవార్ల విగ్రహాలను గ్రామవీధుల్లో ఊరేగించారు. గ్రామంలో భారీ అన్నసమారాధన చేపట్టారు.

సంక్షిప్తంగా...

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

బాడంగి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, తాగునీటి బావులు, బోర్లను క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు.

నేడు వలంటీర్లకు వందనం

మండలంలో సేవా పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లకు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం సత్కార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలంలో మొత్తం 246 మంది వలంటీర్లు సేవలందిస్తుండగా.. వారిలో ఐదుగురు సేవా రత్న అవార్డుకు, 241 మంది సేవామిత్ర అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు.

స్పందన ఫిర్యాదులు పరిష్కరించాలి

రాజాం సిటీ: గ్రామాల వారీగా స్పందనలో వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సచివాలయాల పరిధిలో వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అలాగే ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్కెట్ ఆశీల వేలం వాయిదా

రాజాం సిటీ: మున్సిపాలిటీకి సంబంధించి డైలీ మార్కెట్ ఆశీల వేలం పాట మరోసారి వాయిదాపడింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం వేలం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.34.56లు వేలకు వేలం ప్రారంభించారు. అయితే వేలంలో పాల్గొన్న సభ్యులు 18 శాతం జీఎస్‌టీ లేకుండా వేలం నిర్వహించాలని, అలాగైతే ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే మార్కెట్‌లో వసూళ్లు కష్టంగా ఉన్నాయని, దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. జీఎస్టీ తగ్గించకుంటే పాట మొత్తాన్ని అయినా తగ్గించాలని విన్నవించారు. దీనికి స్పందించిన కమిషనర్ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వేలం నిర్వహిస్తున్నామని, పాటదారులంతా ముందుకు రావాలని కోరారు. దీనికి పాటదారులు ససేమీరా అనడంతో వేలం వాయిదా వేశారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, ఆర్ఐ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం

రేగిడి: ప్రకృతి వ్యవసాయ విధానం రైతులకు లాభదాయకమని ప్రకృతి సేద్యం ట్రైనీ మాస్టర్ పుర్లి లక్షున్నాయుడు, తవిటినాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలను సోమవారం విక్రయించారు. సేంద్రియ పంట ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తహసీల్దార్ రాములమ్మ, రైతులు పాల్గొన్నారు.